క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత లక్ష్మణరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు బుధవారం రూ.1,50,000 విరాళంగా అందజేశారు. తిరువూరుకు చెందిన పొట్లూరి లక్ష్మణరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

దెందులూరు ఎంపీడీఓగా శ్రీలత

దెందులూరు: దెందులూరు మండల ఎంపీడీఓగా వి.శ్రీలత బుధవారం దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీలత కృష్ణా జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తూ బదిలీపై దెందులూరు ఎంపీడీఓగా వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.భీమరాజు నూతన ఎంపీడీఓకు బాధ్యతలను అప్పగించారు.

ఆలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు



కృపగల తల్లి మందిరం వార్షికోత్సవంలో పూజ చేస్తున్న ఫాదర్ బాల

లింగపాలెం: ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు అని, సమాజంలో రుగ్మతలను రూపుమాపటానికి దోహదపడతాయని ఏలూరు ఫాదర్ పి.బాల అన్నారు. లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెం గ్రామంలో బుధవారం కృపగల తల్లి మందిరం 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ బాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఫాదర్లు, పాస్టర్లు సమిష్ట దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరం ఫాదర్ బాల మాట్లాడుతూ క్రీస్తు చూపించిన ప్రేమను ఇతరులకు పంచి సహోదరభావంతో కలసిమెలసి జీవించాలన్నారు. సమాజాభివృద్ధికి అంకితభావంతో పనిచేసేందుకు యువత చొరవ చూపాలన్నారు. క్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలని బాల పిలుపునిచ్చారు. అనంతరం సంఘస్తులు, పాస్టర్లు కలసి ఫాదర్ బాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విచారణ గురువులు హెచ్చు ఏసురత్నం, పలువురు ఫాదర్లు, పాస్టర్లు, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మరో చరిత్ర

- విజయవాడ స్వరాజ్య మైదానంలో 206 అడుగుల విగ్రహం
- ఎమ్మెల్యే ఆళ్ల నాని



సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఇడా చైర్మన్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ చిరంజీవులు



హాజరైన పార్టీ నేతలు, నగర కార్పొరేటర్లు



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఏలూరు టౌన్: అణగారిన, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి, వారి హక్కుల పరిరక్షణకు అహర్నిశలు శ్రమించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్యమైదానంలో బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేయనున్న నేపథ్యంలో ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన పార్టీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు, కార్పొరేటర్లతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యే వారికి చేసే ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ దేశానికి దిశానిర్దేశం చేస్తూ నాడు స్వతంత్ర భారతావనికి రాజ్యాంగ రూపకల్పన చేసి ప్రపంచ మేధావిగా, అణగారిన వర్గాల పక్షపాతిగా పేరుగాంచారని తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపటంతోపాటు, సామాజిక సాధికారతకు బాటలు వేస్తున్నారని వివరించారు. విజయవాడ నడిబొడ్డున రూ.404 కోట్ల భారీ వ్యయంతో అంబేడ్కర్ మహాశిల్పాన్ని సీఎం జగన్ ఆవిష్కరించటం మరో చరిత్రకు నాంది పలుకుతుందని అన్నారు. దేశంలోనే 206 అడుగుల ఎతైన మహాశిల్పాన్ని ఏర్పాటు చేయటం అద్భుత ఘట్టమని కొనియాడారు. సమావేశంలో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, క్లస్టర్-1 పార్టీ అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, కార్పొరేటర్లు తుమరాడ స్రవంతి, పిల్లంగోళ్ల శ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, పొలిమేర దాసు, పార్టీ నాయకులు నున్న కిషోర్, జిజ్జువరపు రమేష్, తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణకు భారీగా తరలిరండి

ఏలూరు (టూటౌన్): ఈ నెల 19న విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐక్య విగ్రహ విష్కరణ, స్మృతి వనం ప్రారంభోత్సవానికి ప్రతి ఒక్కరూ తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషనర్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ కోరారు. స్థానిక విద్యానగర్‌లోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ మేధావి విగ్రహావిష్కరణకు కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా వచ్చి విజయవంతం చేయాలని కోరారు. రాజ్యాంగంలో పొందు పర్చిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ద్వారా అందరూ సాధికారత సాధించి అభ్యుదయ సమసమాజ స్థాపన జరగాలని అన్నారు.

అంబేడ్కర్ భావజాలంతో పరిపాలన

రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుర్రాల రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ నడిబొడ్డున 20 ఎకరాల విశాల ప్రాంగణంలో రూ.400 కోట్లతో అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ఈక్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిందని తెలిపారు. బడుగు, బలహీన వర్గాల వారికి అంబేడ్కర్ స్ఫూర్తిగా పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి



జూదరులను అదుపులోకి తీసుకున్న అధికారులు

ఏలూరు టౌన్: స్థానిక తంగెళ్లమూడిలో పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఎస్పీ మేరి ప్రశాంతి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ తమ సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20,900 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై చర్యలు తీసుకునేందుకు ఏలూరు టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–1999 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. ఆనాటి మిత్రులతో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. అందరూ ఒకచోటు కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు



ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్‌లో తలపడుతున్న జట్లు



ఏఎస్ఆర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



గాంధీకాలనీ సచివాలయం జట్టుపై గెలిసిన పోస్టల్ కాలనీ క్రికెట్ జట్టు



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న లంకపేట, శివగోపాల్‌పురం జట్లు

ఏలూరు రూరల్ : ఏలూరు నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. సంక్రాంతి పండుగ మూడు రోజులు విశ్రాంతి అనంతరం ఏలూరు క్రికెట్, బాడ్మింటన్ పోటీలు కొనసాగాయి. ఇండోర్‌స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీలో గాంధీ కాలనీ సచివాలయం జట్టుపై పోస్టల్ కాలనీ జట్టు, బ్యాడ్మింటన్ విభాగంలో గొల్లాయిగూడెం సచివాలయం జట్టు తోటకూర దొడ్డి సచివాలయం జట్టుపై విజయం సాధించాయి. అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో చేపలతూము సచివాలయం జట్టుపై ఎంఆర్సీకాలనీ సచివాలయం 2 జట్టు, రెండో మ్యాచ్‌లో రజకులపేట సచివాలయం జట్టు లంకపేట సచివాలయం 1 జట్టుపై విజయం గెలిచాయి. క్రికెట్ పోటీల్లో లంకపేట సచివాలయం పురుషుల జట్టుపై శివగోపాల్‌పురం సచివాలయం జట్టు, రెండో మ్యాచ్‌లో గన్‌బజార్ సచివాలయ జట్టుపై పవర్‌పేట సచివాలయం జట్టు విజయం సాధించాయి.

నేటి మ్యాచ్‌లు

గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇండోర్, ఏఎస్ఆర్ స్టేడియంలో 20 మ్యాచ్‌లు నిర్వహించనున్నట్టు కార్పొరేషన్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వెల్లడించారు. ఖోఖో ఐదు, కబడ్డీ నాలుగు, బ్యాడ్మింటన్ ఆరు, వాలీబాల్ రెండు, క్రికెట్ నాలుగు మ్యాచ్‌లు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు ప్రతాప్, కె.మురళీకృష్ణ, భోగలింగేశ్వరావు, మురళీకృష్ణ, ప్రసన్న, పి.గోపీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆళ్ల నానిని కలిసిన విజయరాజు



ఏలూరులో ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసిన విజయరాజు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పార్టీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని, రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో అన్ని స్థానాలు కైవసం చేసుకుంటామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా నియమితులైన కంభం విజయరాజు బుధవారం ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీ అందజేశారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై కొద్దిసేపు చర్చించారు. అనంతరం ఆళ్ల నాని మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువుగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, క్యాడర్‌తో సన్నిహితంగా మెలుగుతూ అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. చింతలపూడిలో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ముగిసిన సప్తాహాలు



ఉత్సవ పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



నాదస్వర బృందాన్ని సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత నెల 28న ప్రారంభమైన శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు రోజు ఉదయం గంటలకు మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, గరుడ ధ్వజ అవరోహణ, చక్ర పెరుమాళ్లకు శ్రీ చక్రస్నానం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దెందులూరుకు చెందిన వై.పెద్దిరాజు బృందం నాదస్వర సమ్మేళనం నిర్వహించారు. రాత్రి దర్బారు సేవ, అనంతరం శ్రీవారి విశేష ఆరాధన, వేద పఠనం, వేద ఆశీర్వచనం, శ్రీవారి పవళింపు సేవ, దంపత్తాంబూల కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకుడు కోసూరి సత్యనారాయణాచార్యులు పూజలు చేయగా, ట్రస్టుబోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	52
వంకాయలు (కాంతులు)	32	బిళ్లచిక్కుడు	120
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	60
బెండకాయలు	30	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	48	కంద	60
కాకర కాయలు	50	బీట్‌రూట్	34
బీరకాయలు	40	కీర దోస	34
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	84
క్యాబేజీ	20	అల్లం	128
క్యారెట్	64	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	28	చుక్కకూర	10
ఉల్లిపాయలు	25-30	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	08
దోసకాయలు	34-48	పుదీనా	05
అనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	02
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	38

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్ఈఎల్	22.15	4822	01
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు - తిరుపతి	16.00	4830	రద్దు

చలో కడపను విజయవంతం చేయాలి

జంగారెడ్డిగూడెం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీల ఏ,బీ,సీ,డీ వర్గీకరణ సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లాగు ప్రకాష్, ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కడిమి రాజేష్ కుమార్ కోరారు. బుధవారం వారు ఈమేరకు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 20వ తేదీన కడప పట్టణంలో నిర్వహించబోతున్న మాదిగల రాజకీయ సమన్వయ మహాసభకు రాష్ట్రంలోని మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ఉద్యోగులు, మహిళలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అణగారిన కులాలకు రాజ్యాధికారంలో అవకాశం కల్పించినప్పుడే ఆయా కులాల్లో కనీస అభివృద్ధికి నాంది పడుతుందని అన్నారు. జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ జిల్లా మెంబర్ ఉక్కుర్తి సీతారాం చేతుల మీదుగా కరపత్రాల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దిపాటి ఇస్సాకు, మద్దిపాటి వెంకటేష్, లాగు ప్రకాష్, గొల్ల మందల శ్రీనివాసరావు, కడిమి రాజేష్ కుమార్, జొన్నకూటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారికి కొవ్వూరు మండలం కుమారదేవంకు చెందిన వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగం రాష్ట్ర నాయకులు పసుపులేటి వీరభద్రరావు(బద్రి) బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి పూజాధికాలను జరుపుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నారసింహుడు తన ఇష్టదైవమన్నారు. భక్తులు స్వామివారికి నైవేద్యంగా సమర్పించే పాలపొంగళ్లకు వందే షెడ్లను తాను నిర్మించినట్టు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని స్వామివారికి పూజలు చేశామన్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, కరాటం చినరాయుడు, శాసనాల రాజేష్ తదితరులున్నారు.

సామాజిక సేవలతో సంతృప్తి



పిప్పరలో వృద్ధులకు ఆర్థిక సాయం అందిస్తున్న సుబ్బరాజు

గణపవరం: పిప్పరలో సామాజిక సేవకుడు కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో సుమారు వంద మంది పేద వృద్ధులకు రూ.500 చొప్పున ఆర్థిక సహాయం, సంక్రాంతి రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ సామాజిక సేవలు, ఆపన్నులకు అండగా ఉండటంలోనే సంతృప్తి లభిస్తుందని అన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొలనువాడ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి ఆర్థిక సహాయం: గణపవరం వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్. విజయరామరాజు (యూఎస్ఏ) ఆర్థిక సహకారంతో యువతకు ప్రోత్సాహం కార్యక్రమంలో భాగంగా గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో చదువుతున్న యలగం హారికకు ఆర్థిక సహాయం, మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేసినట్లు రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు తెలిపారు. ఏటా యువతకు ప్రోత్సాహం పేరుతో విజయరామరాజు ఉత్తమ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, త్యాగరాజ కళాక్షేత్రం అధ్యక్షుడు మాదేటి సురేష్ కుమార్ శ్రేష్ఠి, వర్మ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు జీవితం నేటి తరానికి ఆదర్శం

భీమడోలు: ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సంత మార్కెట్ వద్ద బుధవారం శ్రీకృష్ణదేవరాయలు కాపు యువత ఆధ్వర్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు 533వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పరిపాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేవారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత పాలకులు సంక్షేమ పథకాలు అమలు చేయడం చాలా సంతోషదాయమన్నారు. నేటి తరం రాజకీయ నాయకులకు కృష్ణదేవరాయల పాలనాదక్షత ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు, ఈతకోట బాబి, తాతాజీ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, శివరాం, పట్టాభి, చింతా సత్యకృష్ణ, పసుపులేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ఏలూరు టౌన్: మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు యువకులను ఎదురుగా వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు గాయాల పాలయ్యాడు. ఏలూరు గానుగులపేటకు చెందిన పర్వతం రాకేష్ కుమార్ (17) అతని స్నేహితుడు జగన్ మోహన్ రావు కలిసి ఈనెల 16వ తేదీ సాయంత్రం మోటారు సైకిల్‌పై సోమవరప్పాడు వెళ్లారు. అర్ధరాత్రి సమయంలో తిరిగి ఏలూరు వస్తుండగా ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డులోని తంగెళ్లమూడి ప్రాంతంలో ఒక కారు అతివేగంగా ఎదురుగా వచ్చి మోటారు సైకిల్‌ను ఢీ కొంది. దీంతో రాకేష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు జగన్ మోహన్ రావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఏలూరు టూటౌన్ సీఐ ఎం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్సై శుభాకర్ కేసు దర్యాప్తు చేపట్టారు. మృత దేహానికి ఏలూరు సర్వ జన ఆసుపత్రి లో బుధవారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఇంటిలో చోరీ

ఏలూరు టౌన్: ఇంటి తాళాలు పగులగొట్టి బంగారపు వస్తువులు, వెండి వస్తువులు చోరీ చేశారు . ఏలూరు కట్టా సుబ్బారావుతోటలో నివాసం ఉంటున్న కె.ఈశ్వర్ కుమార్ తన కుటుంబంతో ఈనెల 13వ తేదీన తన కుటుంబంతో విశాఖపట్టణం వెళ్లారు. బుధవారం తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో ఉంచిన ఐదు కాసుల బంగారు ఆభరణాలు, 200 గ్రాముల వెండి వస్తువులు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఏలూరు త్రి టౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.